# 4

## అనంగలేఖ

అనంగలేఖ అరమోడ్చిన కన్నుగవతో కలకల నవ్వింది. ఆమె కాశ్మీర సార్వభౌముడు బాలాదిత్యుని ఏకైక పుత్రిక! ఆ పైన నవనవయౌవనంతో మిసమిసలాడుతున్న విదుషీమణి! ఆపైన అపూర్వ సౌందర్యవతి!

ఇక చెప్పవలసినదేమి ఉన్నది? అందులోను, సిగ్గుపడుతున్నట్టు రవంత శిరస్సు వంచుకుని, ఉండీఉండి, ఓరచూపులతో కలకల నవ్వింది! వీనుదోయివరకు విస్తరించినట్టు సోగదేరిన నీలాలవంటి విశాల నేత్రాలతో హేలగా ఆ సుకుమారి నవ్విన తీరు ఖంఖ మంత్రికి ఒక్కమారుగా నవరత్నాలు ఒలకబోసినట్టుగా రవంత మైమరుపే కలిగించింది! అలాగ నవ్వుతూనే ఆ విలాసవతి మంత్రిమీది కొక సన్నని క్రీగంటిచూపు విసిరింది. అది ఆతని నిండుగుండెనుండి తటాలున దూసుకుపోయింది!

ఆనాడు బాలాదిత్య చక్రవర్తి జామాత దుర్లభ వర్ధనుడు, ఆతని రాణి అనంగలేఖ, ఖంఖమంత్రి కలిసి చైత్రపూర్ణిమా మహోత్సవంనాటి సాయంవేళ, రాజభవనం చుట్టూ విస్తరించిన ఉద్యానవనంలో, ఒక బొండుమల్లెతీగల పొదరింట చంద్రకాంత శిలా వేదికలమీద విశ్రమించి, మిక్కిలి రుచ్యమయిన ద్రాక్షామదిర సేవిస్తున్నారు. అనంగలేఖ ఆనా దంతగా మితిమీరి మద్యం సేవించలేదు.

అయినా, భర్త సరసనే ఉన్నా ఆమె అతని మాటే పట్టించుకున్నట్టు కానరాలేదు! ఉవ్వెత్తుగా ఉప్పొంగుతున్న నవ్వు ఆపుకోలేక తిరిగి తిరిగి విరగబడి నవ్వింది. ఆమె అలాగ నవ్వడానికి ఒక

కారణం లేకపోలేదు. ఆనాటి ఇష్టాగోష్ఠిలో ఖంఖమంత్రి చక్కగా, శ్రావ్యంగా ఒక ప్రాకృతభాష గాథ చదివి, దాని అర్థం వ్యంగ్యంగా స్ఫురింపజేశాడు. గాథ అంటే ప్రాకృతభాషలో ఒక చిన్న శ్లోకం. అది క్రీస్తుశకం ప్రథమశతాబ్దం ప్రాంతంలో హాల సాతవాహన చక్రవర్తి ఎంతో ముచ్చటపడి ఏర్చి కూర్చిన ఖండకవితా సంకలనం గాథా సప్తశతిలోనిది. అది ఆ కాలంలో కాశ్మీర విద్వాంసులలో బాగా వ్యాప్తిపొందింది. సప్తశతిలో ప్రతి గాథలోని భావము దానితోనే పరిసమాప్తమవుతుంది.

ఖంఖమంత్రి వ్యంగ్యంగా వివరించిన ఆ గాథభావం ఇది:

"ఆ నెరజాణ ఆ పెంపుడుకుక్క నెంతటి చాకచక్యంతో మచ్చిక చేసుకున్నదంటే, అది ఆమె భర్త ఇంటికి తిరిగివస్తున్నప్పుడుమాత్రమే గొంతెత్తి మొరుగుతుంది!"

అంటే మిగిలిన ఆమె ప్రియు లెవ్వరయినా ఇంటికి వస్తున్నప్పుడు ఇక ఆ కుక్క నోరెత్తదన్నమాట!

పెనిమిటి ఇంటికి తిరిగివస్తున్నప్పుడుమాత్రమే ఆ కుక్క మొరుగుతున్నదన్న వ్యంగ్యార్థం స్ఫురించినంతలోనే అనంగలేఖ మరి నవ్వు నిలవరించుకోలేకపోయింది. దుర్లభవర్ధనుడా గాథలోని చమత్కారం గ్రహించి, చాలా చక్కగా ఉన్నదని మెచ్చుకుని ఆనందించాడు. అంతేగాని అంతగా నవ్వలేదు. ఖంఖమంత్రి రవంత చిరునవ్వుమాత్రమే వెలువరించాడు. అంతే!

అటుపిమ్మట ఆ ఇష్టాగోష్ఠి మరికొంతసేపు కొనసాగింది. అది ముగియగానే ఒండొరుల నెంతో మర్యాదగా వీడ్కొని, అందరు ఎవరి భవంతుల వైపు వారు తరలిపోయారు.

అయితే ఆనాటి అనంగలేఖ కలకలనవ్వు దుర్లభవర్ధనుని హృదయంలోను, ఖంఖమంత్రి మనస్సులోను వేరువేరుగా విపరీతములయిన ఆలోచనల పరంపరలు రేకెత్తించింది. చక్రవర్తిజామాత హృదయంలో ఆ నవ్వువల్ల కొంత మథన ప్రారంభమయింది.

ఇటీవల ఖంఖమంత్రి కంటపడగానే అనంగలేఖ నెమ్మోము కలకలలాడుతూ వికసిస్తున్నట్టు దుర్లభవర్ధనుడు అంతకుమునుపే

అనుమానించాడు.

అయితే కాశ్మీరంలోగాని, రాణివాసంలోగాని ఆ పురాతన కాలంలో మహిళల కెవ్వరికి తెరలవెనక మరుగన్నది లేదు. ఎంతెంతటి మహారాణులయినా ప్రజానీకం వేడుకలలో, వినోదాలలో యథేచ్ఛగా పాల్గొంటూంటారు. అంతేకాదు, వారొక్కొక్కప్పుడు అమాత్యులతోబాటు రాజ్య వ్యవహారాల చర్చలలో, సంప్రతింపులలో పాల్గొనడంకూడా కద్దు. అదీగాక అనంగలేఖ సార్వభౌముని ఏకైక తనూజ. అందువల్ల చిన్ననాటినించి ఎంతో అల్లారు ముద్దుగా పెరిగింది. దానా, దీనా ఆమె ఏమాత్రము అరమరిక లేకుండా ఖంఖమంత్రితో ప్రసంగిస్తూంటుంది. అదీగాక ఆనా డామె సేవించిన మద్యం కొంచెమే అయినా బాగా మైకం కలిగించి ఉంటుంది. పైగా ఆ గాథ వ్యంగ్యంకూడా చాలా చమత్కారంగా స్ఫురించి ఉండవచ్చును.

ఈ అన్ని కారణాలవల్ల అనంగలేఖ ఒకవేళ అలాగ మైమరిచి విరగబడి నవ్విందేమో! అదే యథార్థ మయితే ఆ సుందరి మంత్రిపై పలాగ ఓరచూపు తూపులు విసరడాని కేమిటి కారణము? ఒకవేళ అనంగలేఖ మనస్సుగాని ఖంఖమంత్రిమీదికి మొగ్గిందా?

అలాగ మరికొంతసేపు మథనపడినా అతని కెందువల్లనో ఖంఖునివంటి ఆప్తునిమీద అపనమ్మకం కలగలేదు. దాని కనేక కారణా లున్నాయి. కాశ్మీరంలో అంతట సుప్రసిద్ధుడయిన జ్యోతిషశాస్త్రవేత్త మేధావి ఒకనాడు కర్కోటక నాగవంశీయుడు దుర్లభవర్ధనుడే బాలాదిత్య చక్రవర్తి అనంతరం కాశ్మీర సామ్రాజ్యానికి ఉత్తరాధికారి కాగలడని ఖచ్చితంగా జోస్యం చెప్పినప్పటి నుండి సార్వభౌముని కుటుంబంలో కలతలు కొన్ని బయలు దేరాయి.

ఏది ఏమైనాసరే, అత్యంత ప్రాచీనకాలంనించి కాశ్మీరం పరిపాలిస్తున్న గోనందవంశం తనతో విచ్ఛిన్నమయిపోకూడదన్న దృఢ నిశ్చయంతో బాలాదిత్య చక్రవర్తి శాత్రవకేసరి అన్న గోనందవంశ జ్ఞాతి నొకనిని దత్తపుత్రుడుగా స్వీకరించి, ఆతనికే

యువసార్వభౌమ పట్టాభిషేకం జరిపించాడు.

అప్పటినించి చక్రవర్తితోబాటు కొందరు మంత్రులు, సేనానాయకులు శాత్రవకేసరి పక్షం వహించారు.

కాని బాలాదిత్యుని పట్టపురాణికిమాత్రం శాత్రవకేసరికి యువ సార్వభౌమ పట్టాభిషేకం జరిపించడం కేవలం ఘోరమయిన దుర న్యాయమని అనిపించింది. అల్లుడు దుర్లభవర్ధనునికే సామ్రాజ్యాధి కారం సంక్రమింపజేసి, తన కుమార్తె అనంగలేఖకు పట్టమహిషి గౌరవం ప్రసాదించాలని ఆమె ప్రగాఢాభిలాష. ఖంఖమంత్రి ఆమె కోరిక అన్నివిధాల న్యాయమయినదే అని అంగీకరించి, దానికి తాను కాయశక్తులా తోడు పడగలనని మాట ఇచ్చి ప్రోత్సహించాడు. అటుపిమ్మట దుర్లభవర్ధనుని కెంతో ఆత్మీయుడయి, ఆతని కెల్ల వేళల తోడునీడగా నడుచుకుంటున్నాడు.

అదే సమయంలో బాలాదిత్య చక్రవర్తి శరీరంలో అసాధ్య మయిన రుగ్మత ఏదో ప్రవేశించి, మరి శయ్యమీద అటు, ఇటు కదలనియ్యని ప్రమాదకరమయిన పరిస్థితి కలిగించింది. ఆ విషమ సంధిలో అటు శాత్రవకేసరిపక్షం వహించిన చక్రవర్తి బాంధవులు, ఇటు దుర్లభవర్ధనునివైపు మొగ్గిన పట్టపురాణి దగ్గిర చుట్టాలు అతి రహస్యంగా కాశ్మీర సింహాసనాక్రమణంకోసం సన్నాహాలారంభిం చారు.ఇరుపక్షాలవారు ప్రబలులయిన ఎదిరిపక్షంవారిని సామదాన భేద దండోపాయాలతో తమవైపు ఆకర్షించుకోవడానికి సాధ్యమయినంత వరకు ప్రయత్నించారు. అటువంటి గడ్డు పరిస్థితులలోకూడా ఖంఖమంత్రి దుర్లభవర్ధనునిపక్షం విడిచిపెట్టక సుస్థిరుడై నిలు చున్నాడు. అంతేకాదు, ఎన్నెన్నో రాజ్యకార్య వ్యవహారాలలో కుడిభుజమై ఆతని నాదుకున్నాడు.

అటువంటి ఆత్మీయు డీనాడు అనంగలేఖపై కన్నువేసి తన ఎడల తీవ్ర ద్రోహం తలపెట్టగలడా? ఈ వ్యవహారంలో కుతంత్రమేమయినా ఉన్నదా? అటువంటి కుటిలుడయినపక్షంలో తన పక్షం వహించి ఇన్ని విధాల సాయపడగలడా? అ విధంగా ఎన్నెన్ని విధాల గుంజాటనపడినా ఖంఖమంత్రి అంతటి ద్రోహి కాగలడని

భావించదానికికూడా దుర్లభవర్ధనుని కేమాత్రము మనస్కరించలేదు.

అయితే అనంగలేఖవంటి అపూర్వ సౌందర్యవతి హావభావ చేష్టలతో నవ్వుతూ కన్పిస్తున్నప్పుడు ఎంతెంతటి ఆప్తమిత్రుడయినా ఆపంతయినా చలించకుండా ఉండగలడా?

దుర్లభవర్ధనునికి తన విషమ పరిస్థితి తలుచుకోగానే విపరీత మయిన వేదన కలిగింది. కాశ్మీరంలో తా నంతకు మునుపు మేలు జాతి గుర్రాలకు పసిరిపచ్చిక, సైంధవ లవణము మొదలయిన వస్తువులు సమకూర్చే అశ్వఘాస శాఖ కధిపతి పదవి నిర్వహించే వాడు. అప్పు డేవిధమయిన బీకు, చింత లేక ఏదో ఒక ఉత్త మాశ్వంపై కాశ్మీర పరిసరారణ్యాలలో విహరిస్తూ నిశ్చింతగా కాలం గడిపివేసేవాడు. అటువిమ్మట తలవనితలంపుగా అకస్మాత్తుగా కాశ్మీరాధిపతి అల్లుడే అయినాడు!

ఆపైన సామ్రాజ్యాధికారం యావత్తు తనకే కైవసం కాగల దన్న మేధావి జోస్యం మాటిమాటికి అటువంటి సదవకాశం జార నియ్యరాదని ఎలుగెత్తి హెచ్చరిస్తున్నది! కాని అంతలోనే అనంగ లేఖ కలకల నవ్వుతూ ఖంఖునిపై విసిరిన కొంటెచూపు కవ్వింపు అతని గుండెలో విషంపూసిన బాణంలా నాటుకుని కళుక్కు కళుక్కు మని వేధిస్తున్నది.

'ఆహా! మహిళలపై వీడరాని మమకారం పెంపొందించుకున్న మానవు లెంతటి దురదృష్టవంతులు!' అని ప్రాణా లొక్కమారుగా ఎగిరిపోయినట్టుగా ఉసూరుమని నిశ్వసించాడు. సరే, ఇక ఎన్నెన్ని దుర్భర పరిస్థితు లెదురుపడినాసరే లక్ష్యపెట్టక కాశ్మీర సార్వభౌమాధి కారం స్వాయత్తంచేసుకుని మేధావి జోస్యం అక్షరాల ఫలించేటట్టు చేసితీరాలని మరి తిరుగులేని తీవ్రశపథం స్వీకరించాడు.

* * *

ఇక ఖంఖామాత్యునికి అనంగలేఖ అలతినగవు కవ్వింపుతో పూర్తిగా మతి పోయినట్టే అయింది! ప్రత్యేకించి ఆ ఒయ్యారి కటాక్ష వీక్షణం ప్రసరింపజేసిన భంగిమ అతని హృదయంలో లోతుగా మలిచి రూపొందించినట్టే స్థిరపడిపోయింది! అంతేకాదు,

మేలుకున్నా, గాఢనిద్రలో ఉన్నా, ఆ భంగిమ అతని అంతరాంతరాలలో లీలగా అణిగి మణిగి వెలుగుతున్నట్టే స్ఫురించింది!

ఒక్కొక్కప్పు డతనికి అనంగలేఖ అనురాగ వైఖరి తలుచుకుంటే ఎంతో ఆశ్చర్యం కలిగేది! దుర్లభవర్ధను డెంతో అందగాడు! తన కంతటి సౌందర్యంలేదు. అతడు నేడు కాకపోయినా రేపయినా తప్పకకాశ్మీరాధిపతి కాగల అవకాశా లెన్నో కానవస్తున్నాయి. ఇక తాను కేవలం మంత్రిమాత్రమే! అదీగాక తనకు నలభయ్యవపడి దాటిపోయింది! దుర్లభవర్ధనుని కింకా యౌవనప్రాయమే! అయినా మరి తనపై అనంగలేఖవంటి లావణ్యవతి కంతటి అనురక్తి ఎందుకు కలుగుతున్నది?....అవును! అనంగలేఖవంటి మదవతుల కెప్పు డెవరి మీద మక్కువ కలగగలదో ఎవరు చెప్పగలరు?

కాని దుర్లభవర్ధనుడు తనమీద పెంపొందించుకున్న గౌరవాదరాలవల్లనయితేనేమి, ప్రగాఢాత్మీయతవల్లనయితేనేమి, అనంగలేఖపై కలుగుతున్న అనురాగావేశం నిగ్రహించుకునితీరాలని ఖంఖమంత్రి దృఢంగా నిర్ణయించుకున్నాడు. కనకనే ఆనాటినించి తనతో, అనంగలేఖతో కలిసి మధుపానగోష్ఠిలో పాల్గొనవలిసినదని దుర్లభవర్ధనుడు స్వయంగా ఆహ్వానించినా, ఖంఖమంత్రి ఏదో సాకు చెప్పి తప్పించుకున్నాడు. కాని రాజ్యకార్య పరిశీలనమాత్రం యథాప్రకారంగావే కొనసాగిస్తూ, అతని కన్నివిధాల తోడ్పడుతూ మరింతగా సన్నిహితుడై తలలో నాలుకవలె మసులుకున్నాడు.

అయితే ఒక్కొక్కప్పుడు అంతఃపురంలో దుర్లభవర్ధనునితో కలిసి రహస్యంగా మంతనాలు కొనసాగిస్తున్న తరుణంలో తలవని తలంపుగా, అకస్మాత్తుగా అనంగలేఖ అక్కడికి వచ్చి వారి సంప్రతింపులలో పాల్గొనేది! ఆమెవైఖరి గమనిస్తే అప్పుడే చక్కగా అలంకరించుకున్నట్టు జాజ్జ్వల్యమానంగా వెలిగిపోయేది! ఆ తరుణంలో మంత్రి హృదయంలో వెచ్చని చలిమంట రగులుతున్నట్టుండేది. అయినా అత్యంత నిగ్రహంతో అరవిరిసిన చిరునవ్వులతో, ఎంతో మర్యాదగా అంటీఅంటనట్టు ప్రసంగం కొనసాగించేవాడు.

అలాగలాగ మరికొంతకాలం గడిచిపోయిన పిమ్మట చిన్నరాణి అనంగలేఖ హృదయంలో తనపై ఆగ్రహావేశం రగులుకుంటున్న దేమో అని మంత్రి కొక గట్టి అనుమానం కలిగింది. కాని అటువంటి విషమసంధిలో తానేమి చెయ్యగలడు? ఆమెకే కనక నిజంగా తన ఎడల అంతటి ఆగ్రహమే కలిగినపక్షంలో, భర్త కేవేవో కల్పించి చెప్పి కాశ్మీరంలో తన జీవితానికి ముప్పు కలిగించవచ్చును. పోనీ, ఆమె అభిలాష ప్రకారమే నడుచుకుంటే? .... దుర్లభవర్ధనునివంటి స్నేహశీలికి తా నావిధంగా ద్రోహి కాగలడా? అది ఎన్నటికీ సంఘటిల్ల నేరదు!

అదీగాక అత డితీవల తన రాజ్యకార్య చాకచక్యంతో ప్రజ్ఞాదిత్యుడన్న ఘనబిరుదం గడించుకున్నాడు. అటువంటి మహామేధావి ఒక్క చూపుతోనే తన భావం పసికట్టివెయ్యగలడు!—అదీగాక అది ఎంతటి విశ్వాసఘాతుక చర్య?

అలాగ ఆలోచించి, ఆలోచించి ఏది ఏమయినా తానిక అనంగలేఖమాటే తలపెట్టకూడదని ఖంఖమంత్రి ఖచ్చితంగా నిశ్చయించుకున్నాడు. సాయం సంధ్యవేళ మంచుతెరలలో తరళిస్తున్న నిండు జాబిల్లిలాగ అనంగలేఖ నవ్వుముఖం ఎప్పుడయినా తన హృదయంలో ప్రతిఫలించినా వెనువెంటనే దానిని దృఢనిశ్చయంతో దూర దూరంగా తొలిగించివేశాడు!

అలాగ తన యావచ్ఛక్తి వినియోగించి ప్రయత్నించినా అనంగలేఖ మనోజ్ఞమూర్తి అతని హృదయంలో కాశ్మీర సరోవరాలలో మాఘమాససంధ్యలా మాటిమాటికి ప్రతిఫలించింది. అంతేకాదు. అతని ఆలోచనలెల్ల వేళల పట్టి బంధించి ఆకట్టుకున్నది. హృదయాకాశంలో నిశ్చలమయిన మెరుపుతీగలా నిలిచింది. తోడునీడలా వెన్నాడింది. క్రమక్రమంగా ఎంతగా ప్రయత్నించినా అతని కంటికొక్క కునుకయినా పట్టలేదు!

అయినా ఖంఖమంత్రి అనంగలేఖ కెంతో దూరదూరంగా ఉండితీరాలనే నిశ్చయించుకున్నాడు. అదేవిధమయిన అచంచలదీక్షతో ఆమెతో, దుర్లభవర్ధనునితో కలిసి రాజ్యతంత్రగోష్ఠిలో పాల్గొన్నా.

ఎక్కడ చెక్కుచెదరని మర్యాదతో, గౌరవంతో దుర్లభవర్ధనుని మన్నన లందుకున్నాడు.

*    *    *

క్రమక్రమంగా బాలాదిత్య సార్వభౌముని రోగపరిస్థితి బాగా ప్రమాదకరంగా పరిణమించింది. అటు శాత్రవ కేసరివర్గీయులు, ఇటు దుర్లభవర్ధనుని వర్గీయులు చక్రవర్తి మరికొన్నాళ్ళవరకయినా జీవించే అవకాశం లేదని గ్రహించి తమ తమ ప్రభువులను కాశ్మీరధాత్రి గద్దెపై కెక్కించడానికి అతి రహస్యంగా ప్రయత్నా లారంభించారు. అందువల్ల ప్రజానీకంలో కూడా నానాటికి కొంత అల్లకల్లోలం చెలరేగింది. సార్వభౌముని సైన్యంలోనే చీలిక లేర్పడ్డాయి.

సామంతప్రభువులు కొందరు తమ తమ అవకాశాలనుబట్టి బలీయమయిన పక్షంవైపు మొగ్గి మున్ముందు సామ్రాజ్యంలో పలుకుబడి పెంపొందించుకోవాలని ఆరాటపడ్డారు. అటువంటి పరిస్థితులలో ఖంఖమంత్రి, దుర్లభవర్ధనుడు ఒక్క నిమిషమయినా తీరికలేక శ్రీనగరంలోనేకాక, కాశ్మీరంలో ఆయా ప్రధాన నగరాలలో విడిది చేసి వేర్వేరు రీతుల సంగ్రామ సన్నాహా లారంభించారు.

ఆ సమయంలో ఒకనాటి రాత్రి రెండు ఝాముల కాలం గడిచిన పిమ్మట "నన్నొకమారు అతి త్వరితంగా వచ్చి చూచిపోవలిసినది" అన్న దుర్లభవర్ధనుని సందేశం రాజవార్తాహరుడొకడు అతి రహస్యంగా ఖంఖమంత్రికి నివేదించాడు.

ఆ వార్త విన్నంతలోనే మంత్రి కెంతో ఆందోళన కలిగింది. 'అతి రహస్యంగా సైన్యం కొంత సమాయత్తపరిచే సంకల్పంతో దుర్లభవర్ధనులు రాజధాని విడిచి అవంతీపురానికి విజయంచేశారని విన్నానే! వారప్పుడే మరలివచ్చారా? వస్తే ఇంత నిలుచున్నట్టుగా అర్ధరాత్రివేళ సందర్శించిపోవలిసిందని సందేశం పంపించడానికేమిటి కారణము? ఒకవేళ శాత్రవులవల్ల అకస్మాత్తుగా వారి కేవిధమయిన ప్రమాదము సంఘటిల్లలేదుగదా? లేక అకస్మాత్తుగా వేరొక ఉపద్రవ మేది సంభవించలేదుగదా!' అని అనేకవిధాల కళవళపడ్డారు. మరి ఒక క్షణమయినా ఆలసించరాదని నిశ్చయించి సముచిత

వేషంతో సన్నద్ధుడై ఒక ఉత్తమాశ్వంపై అధిరోహించి అతి త్వరితంగా అంతఃపురంవైపు సాగిపోయాడు.

అశ్వంమీదినుండి మరికొంతదూరం సాగిపోయి, అంతఃపురం సింహద్వారంలో అడుగుపెట్టగానే అనంగలేఖ పరిచారిక ఆతని నత్యంత గౌరవంతో దుర్లభవర్ధనుని శయ్యాగారంవైపు తోడుకొనిపోసాగింది.మార్గమధ్యంలో ఆతని ఆత్రత మరింతగా ఎక్కువయింది. 'తప్పక దుర్లభవర్ధనుల కేదో దారుణ ప్రమాదం జరిగిఉండవచ్చును!' అని ఆందోళనపడ్డాడు. మరి ఓరిమి వహించలేక "దుర్లభవర్ధనులకు క్షేమమేనా?" అని ఆ పరిచారికవైపు చూచి ఎంతో ఆత్రంగా ప్రశ్నించాడు.

ఆమె చేతులు రెండు జోడించి మిక్కిలి నమ్రతతో "ఏలినవారినిగూర్చి నావంటి దాసి కెలాగ తెలుస్తుంది బాబూ!" అని సమాధానం చెప్పింది.

"ఏదో ఆందోళనకొద్దీ అడిగానుకాని, ఇలాంటి విషయాలు ఈ పరిచారిక కెలాగ తెలుస్తాయి?" అని తన్ను తాను సమాధానపరుచుకున్నాడు. ఆ పరిచారిక మరికొన్ని గదులు దాటించి అతనినింకా లోలోపలికి తోడుకునిపోయింది.

ఖంఖమంత్రికి అంతకుమును పెన్నడు దుర్లభవర్ధనుని శయ్యాగృహం సందర్శించవలసిన ఆవశ్యకత కలగలేదు. అటువంటి అక్కర అతని కెందుకు కలుగుతుంది? ఆ భవంతి లోపలిభాగం అంతా వేర్వేరు రంగుల గాజుకుప్పెలలో, గోళాలలో అమర్చిన దీపికలతో జాజ్వల్యమానంగా వెలిగిపోతూ కనుదోయికి మిరుమిట్లు కలిగిస్తున్నది. అప్పుడప్పుడు మంత్రి 'ఇక ఇదే దుర్లభవర్ధనుల శయ్యాగృహమయి ఉంటుంది!' అని భావించాడు. కాని మరునిమేషంలోనే తన ఊహ తప్పిపోయినదని గుర్తించుకున్నాడు. అటుపిమ్మట ఆ పరిచారిక అతని నొక ద్వారందగ్గిర నిలిపి, "ఇదే ప్రభువుల శయ్యాగృహము. లోపలికి విజయం చెయ్యండి" అని విన్నవించి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

ఆ ద్వారంలో ముత్యాలజాలరులతో వేలాడుతున్న చిలకపచ్చ

పట్టుతెరలు నెమ్మదిగా తొలగించి లోపల అడుగుపెట్టాడు ఖంఖ మంత్రి. ఎదురుగా ఒక శయ్యాసనంమీద లీలగా ఒరిగి కూర్చున్న అనంగలేఖ తరళదీపకాంతిలో మెరుస్తున్న రత్నాలంకారాలతో తళతళలాడుతూ సాక్షాత్కరించింది! 'ఆహా! ఏమి అతిలోకసౌంద ర్యము!....ఇటువంటి ఆపత్సమయంలో చిన్నరాణీ ఇంత నేత్రానంద కరంగా అలంకరించుకున్నా రేమి చెప్మా!' అని క్షణకాలం విస్తు పోయాడు ఖంఖ మంత్రి. వెనువెంటనే ఇనుమడిస్తున్న ఆత్రతతో ప్రశ్నించాడు.

"అనంగలేఖాదేవీ! దుర్లభవర్ధనులకు కుశలమేనా? వారెక్కడ విశ్రమించిఉన్నారు?"

అత డా గదికి పక్కగా వేరొక గదిలో విశ్రమించి ఉండ వచ్చునని, ఆమె ద్వారంలో తన రాకకోసమే నిరీక్షిస్తూ ఉండవచ్చు నని ఖంఖమంత్రి భావించాడు. అంతలోనే అనంగలేఖ శయ్యాసనంపై రవంత నిలువుగా కూర్చుని చెక్కిళ్ళపై పొరాడుతున్న దరిహ సితంతో కనురెప్ప లొకించుక వంచి, వినబడీ వినబడనట్టు నెమ్మది నెమ్మదిగా సమాధానం చెప్పింది. "వారికి క్షేమమే! వారికోసం మీరేమి ఆత్రపడనక్కరలేదు! సైన్యసన్నాహ ప్రయత్నాలలో పడి వారింకా అవంతీపురంనుండి శ్రీనగరానికి మరలిరాలేదు. బహుశః విజయంచేస్తే రేపు ఉదయానికి విజయం చెయ్యవచ్చును."

ఆ ప్రత్యుత్తరంతో ఖంఖమంత్రికి నో రెండిపోతున్న ట్టనిపిం చింది. మరింత ఆత్రంగా ప్రశ్నించాడు.

"అయితే అకస్మాత్తుగా నన్నింతటి అపరాత్రివేళ ఇక్కడికి పిలిపించడాని కేమిటి కారణము? అంతఃపురంలోగాని మరే విధ మయిన విద్ధూరము పుట్టలేదుగదా?"

కాని అతని హృదయంలో 'చిన్నరాణీ ఏదో ఒక సాకుతో నన్నిక్కడికి పిలిపించినదేమో!' అన్న ఆలోచన తటాలున దూసుకు పోయింది! దానితో అతని మనస్సులో సంతోషపారవశ్యము, విపరీత భీతి, ఆందోళన ఒక్కమారుగా ముప్పిరిగొన్నాయి! క్షణకాలం ఆమెపై పేక్షాగ్రదృష్టి ప్రసరింపజేశాడు. సన్నని వలిపెంలోనుండి

ఆమె నెమ్మేను దృశ్యాదృశ్యంగా కానవస్తున్నది. మద్యపాన ప్రమత్తత రాణి సోయగానికి బాగా మెరుగులు దిద్దుతున్నది.

అంతలోనే అనంగలేఖ కొంటెగా అతనివైపు చూచి లీలగా నవ్వింది.

"ఇంతటి రాత్రివేళ మిమ్మల్ని ఇక్కడికి పిలిపించడాని కేమి కారణమో తెలియనంతటి అమాయికులా మీరు? చాలుచాలులెండి! మీ ఆంతర్యం నాకు తెలియలేదనుకున్నారా?....దయచేసి కొంచెం నటన కట్టిపెట్టండి!"

ఆ కవ్వింపుతో అతనికంతా మంచు విడిపోయినట్టు విడిపోయింది! 'ఆహా! ఇంతటి అపూర్వ సౌందర్యరాశి నొక్కమారు అక్కున చేర్చుకుంటే, ఇక ఈ జన్మలో, ఈ లోకంలో కోరుకోవలిసిన దేమి ఉన్నది? మిన్ను విరిగి మీద పడినాసరే, ఈ రాత్రివేళ ఈ స్వర్గ సౌందర్యామృతం అంతా ఒక్కమారుగా జుర్రుకుంటే!'.... అన్న ఆలోచన పులకరింపులతో జలదరింపజేసింది. కాని వెంటనే తమాయించుకుని, శిరస్సుతోబాటు కనురెప్ప లొకించుక వంచి, అణగించివేసుకున్న మందహాసంలో దోసిలికట్టి ప్రతిమాలుకున్నాడు.

"రాకుమారీ!మీ రన్నది నిజమే! నే నామాత్రం గ్రహించుకోకపోలేదు. కాని నే నిక్కడికి వచ్చేటప్పుడు మాత్రం ప్రభువర్యుల కేదయినా ప్రమాదంగాని జరిగినదేమో అని భయపడుతూనే ఉన్నాను. అంతకన్న నా కింకొక ఆలోచన కలగలేదు. నా మాట నమ్మండి! దుర్లభవర్ధనులు నాకు కేవలం ప్రభువర్యులుమాత్రమే కాదు! ప్రాణాధికులయిన ఆత్మీయ మిత్రులు! అంతరాంతరాలలోకూడా వారికి నే నెన్నటికి ద్రోహం తలపెట్టజాలను! దయఉంచి నన్ను మన్నించి సెలవిప్పించండి!"

తిరిగి కనురెప్పపాటయినా లేక శయ్యాసనంపై రవంత మైకంతో ఓరగా ఒరిగిన అనంగలేఖ సవిలాసవైఖరి పరిశీలించాడు. నేత్రద్వయి హేలగా ఓరగా వంచి, ముత్యాలహారాలు సవరించుకుంటున్న ఆమె సస్మిత విలాస వైఖరి అతనిలో మరింతగా ఉన్మాదావేశం కలిగించింది. ఒకటి రెండు క్షణా లలాగ నిలుచున్నా ఆమె

పెదవులు విడివిడుతున్నట్టు కానరాలేదు. వాని కావిరంగు అతనినక్కడే కట్టి పడవేస్తున్నది!

మంత్రి మరి ఆమె అనుమతిమాటే తలపెట్టక ద్వారంవైపు నెమ్మదిగా రెండుమూడడుగులు వేశాడు. అంతలోనే అతని శ్రుతి కుహరాలలో అత్యంత తీవ్రమయిన అనంగలేఖ హెచ్చరిక గభీరంగా మారుమ్రోగింది.

"సరేగాని, మీ రిక సజీవులై అంతఃపుర ద్వారం దాటి బయట పడగలరా? కొంచెం ఆలోచించుకుని మరీ కదలండి!"

ఖంఖమంత్రి తటాలున వెనుదిరిగి చూచాడు. అనంగలేఖ ముఖం పద్మరాగ మాణిక్యాల రాశిలా జేవురించింది! కాని పెదవిపై చిరునవ్వింకా దృశ్యాదృశ్యంగా దోబూచులాడుతూనే ఉన్నది. 'క్రోధావేశంకూడా చిన్నరాణి కెంతటి అపురూపమయిన అలంకారమయినది!' అని ఆశ్చర్యపడి, ఆమె చరణాల కనతిదూరంలో మోకరిల్లి, నమస్కరించి, ఉట్టిపడుతున్న అడకువతో, ఆత్రతతో బ్రతిమాలుకున్నాడు.

"రాకుమారీ! మీ రాగ్రహించడానికికూడా తగినంత అర్హత నాలో లేదు! నే నెక్కడ? తా మెక్కడ? జాలిదలిచి, మనఃపూర్వకంగా అనుమతి దయచేయించండి. చరణసేవకులపై మీ కింతటి నిర్దాక్షిణ్యం పనికిరాదు!"

రాజకుమారి అతని ముఖపై ఖరి నిశితంగా పరిశీలించి శయ్యాసనంమీదినుండి లేచి నిలిచి కలకల నవ్వింది.

"తప్పు! తప్పు! మీరు మహా రాజనీతిచతురులు! విద్వద్వరేణ్యులు! ఇటువంటి మీరు నాకలాగ నమస్కరించవచ్చునా? ఇకనయినా ఈ కపటవినయం కట్టిపెట్టి లేవండి!"

అనంగలేఖ ఒయ్యారంగా కిందికి వంగి అతని రెండుచేతులు గట్టిగా పట్టి పైకి లేవనెత్తింది. ఆ సుకుమారి కరతలస్పర్శతో మంత్రి శరీరంలో ప్రతి అణువు ఒక్కొక్క ఇంద్రధనుస్సయి వికసించి, తళతళ మెరిసే నఖశిఖపర్యంతము పులకలతోబాటు మైమరుపు కలిగించింది! అయినా అతి కష్టంమీద నిగ్రహించుకుని ఎలాగో అలాగ

అక్కడినించి బయటపడితీరాలని అత డొకింతసేపు లోలోపల పెనగు లాడకపోలేదు. కాని ఆ పరిపూర్ణ యౌవనవతి బిగి కౌగిలింతలో చిక్కుకున్న అతని కిక శరీరంమీది స్పృహే సడలిపోయింది! తిరిగి కొంచెం తెలివి వచ్చినప్పుడు మాత్రం 'ఈ లోకాచారాలు, మర్యాదలు, మమతలు, ఆత్మీయమిత్రుల అనుబంధాలు ఆదిగా గలవన్నీ ఈ లలనామణి రవంత గాఢాశ్లేషంతో సరిపోలగలవా? ఇవి అన్నీ దుర్బల మానవులు కల్పించిన వట్టి విభ్రాంతులు! ఎండమావులు! ఆహా! నే నీనాడు ఆ స్వర్గాధిపతినే తలదన్నివేశాను! ఇక మరణ మయినా వరణీయమే!' అని సగం ముకుళించిన కన్నుగవతో భావించుకున్నాడు.

* * *

కొంచెం నిద్రకళ్ళతో జోగుతూ, అనంగలేఖతో కలిసి తా నాస్వాదించిన సశరీర స్వర్గసౌఖ్యామృతం చవి నెమరువేసుకుంటూ, మంత్రి ఇంకా బాగా తెల్లవారకమునుపే అంతఃపురంనించి బయట పడ్డాడు. ఆయా వ్యవహారాల పర్యాలోచనకోసం దుర్లభవర్ధనుని భవంతిలో అత డలాగ అప్పుడప్పుడు నిలిచిపోతూండడం రాణివాసం కావలివారి కేమి కొత్త కాదు. అందుచేత వారి కెవరికి అతనిమీద ఏమాత్రము అనుమానం కలగలేదు. కాని మంత్రిమాత్రం తన్నం దరు అనుమానిస్తున్నారేమో అని ఆతపడ్డాడు. అయినా సహజ గాంభీర్యంతో ముఖంలో ఎక్కడ ఆత్రత కనబడనియ్యలేదు. అంతః పురం సింహద్వారం దాటి బయటపడగానే గతరాత్రి జరిగిన రహస్య సంఘటన మరి రెండవ కంటివారి కెవ్వరికి తెలియజాలదని సంపూ ర్తిగా సంతృప్తి కలిగింది. 'అమ్మయ్య!' అనుకుని సుదీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు.

తన అశ్వంపైనుండి దిగి అత డింటిలో అడుగు పెట్టగానే దుర్లభవర్ధనుని వార్తాహరు డొకడు అతని కొక చిన్న దంతపుపెట్టె అందించాడు. అది దుర్లభవర్ధనుని హస్తాక్షరాలతో లక్కతో మిక్కిలి జాగ్రత్తగా మూసిన పేటిక! దానివైపు చూడగానే ఖంఖ మంత్రి చేతులు వణికాయి. శీఘ్రమే ఆ పెట్టె తెరిచి భూర్జ పత్రంపై

దుర్లభవర్ధనుడు స్వహస్తంతో వ్రాసిన లేఖ చదువుకున్నాడు.

"పరమాత్మీయమిత్రులు ఖంఖమంత్రివరేణ్యులకు:

నే నీంతకుమునుపే రాజధానికి మరలివచ్చి, అంతఃపురంలో ప్రవేశించి, మీరు నా శయ్యాగృహం ద్వారం తెరుచుకుని బయట పడడం స్వయంగా తిలకించాను.

స్త్రీజాతి సహజ చంచలము! అందులోను సుందరాంగనల హృదయాల రహస్యాలు విధాతకయినా దురవగాహాలే!

ఆ క్షణంలో నా ఎదదలో మీ ఎడల దారుణమయిన క్రోధాగ్ని జ్వాల రగులుకున్నది! అయినా అచంచల వివేకంతో అదిఅంతా నిగ్రహించివేసుకున్నాను! తలుచుకునిఉంటే మిమ్మల్ని అక్కడి కక్కడే అప్పుడే తుత్తునియలుగా విదళించివేయించిఉందును! కాని, మానాభిమానా లుజ్జగించిన ఒక చపల వనితకోసం మీవంటి సౌహార్ద మూర్తిని బలిపెట్టడం సముచిత మనిపించలేదు. అంతేకాదు. ఆమెపై చెలరేగిన అక్కసున్ను కూడా నే నుత్తరక్షణంలోనే నిగ్రహించి వేసుకున్నాను. సమస్తానికి సర్వ సమర్థుడనయిన నేను మీ కింతకన్న లిఖించవలసిన దేమి ఉన్నది?

మీ రిది సర్వదా జ్ఞప్తియం దుంచుకోగలరని నా నమ్మిక.

మీ యెడల సదా స్నేహార్ద్రహృదయుడు, దుర్లభవర్ధనుడు."

అది చదవగానే ఖంఖమంత్రికి కళ్ళలో చీకట్లు కమ్ముతున్న ట్లనిపించింది. తిరిగి తిరిగి ఆ లేఖ నాలుగైదు మారు లదేపనిగా చదువుకున్నాడు. శరీరం అంతట ముచ్చెమటలు పోశాయి. తిరిగి ఆ లేఖ విషయమే ఆలోచించడం ప్రారంభించాడు.

క్రమక్రమంగా అతని మనస్సులో అనంగలేఖపై ఏర్పడిన అపూర్వాహ్లాదభావన అంతా పూర్తిగా మంచు విడినట్టు కరిగి పోయింది. ప్రపంచలో తనవంటి పరమ మిత్రద్రోహి మరి జన్మించ బోడని విపరీతమయిన ఏహ్యభావం కలిగింది. 'అవును! దుర్లభవర్ధనులు తలుచుకుంటే నన్ను అక్కడి కక్కడే చిత్రవధ చేయించి ఉండేవారు! ఆహా! ఆ మహనీయు డెంతటి ఆత్మనిగ్రహశాలి! కరుణార్ద్రహృదయుడు!' అనుకున్నాడు. దుర్లభవర్ధనుని అపార

మయిన ఔదార్యం తలుచుకోగానే ఖంఖమంత్రి చెక్కిళ్ళపై వేడివేడి కన్నీటిబిందువు లొకటి రెండు నిలిచాయి.

మరికొంతసేపటికి 'సరేగాని, మీ రిక సజీవులై అంతఃపురం నుండి బయటపడగలరా?' అన్న అనంగ లేఖ తీవ్రాతితీవ్రమయిన బెదరింపు అతని శ్రుతి కుహరాలలో తిరిగి ఖంగుమని మారు మ్రోగింది. ఎంతగా తప్పించుకుని బయటపడాలనుకున్నా, ఆమె అకస్మాత్తుగా ప్రగాఢాశ్లేషంతో బంధించి ఉక్కిరిబిక్కిరి చేసినందు వల్లనే తా నంతటి దుష్కార్యానికి ఒడికట్టినట్టు, లేకపోతే తా నంతటి ద్రోహి కాలేనట్టు అతని కనిపించింది. 'ఆ సంగతి దుర్లభవర్ధనునికి తెలిసిఉంటే ఎంత బాగుండేది!' అని ఒక వేడినిట్టూర్పు విడిచి పెట్టాడు.

కాని కొంత నిశితంగా ఆత్మపరిశీలనం జరగగానే అతని పెద వులపై తన ఎడల అవహేళనతో మేళవించిన చిరునవ్వు చిందులు తొక్కింది. తా నెంతగా తిరస్కరిస్తున్నా, ఆమె నొక్కమారు అక్కున చేర్చుకోవాలని హృదయం పరవళ్ళు తొక్కుతూనే ఉన్నది! చరణాల సన్నిధిని మోకరిల్లి వెలుపలికి పోనియ్యవలసిందని ఎన్నెన్ని విధాల ప్రాధేయపడినా, అదేక్షణంలో చిగురాకులవంటి ఆమె పెద వుల తీయతేనె తనివిదీరా ఆస్వాదించాలన్న తహతహ కళ్ళెం తెంచు కున్న గుర్రంలా పరుగులు పెట్టింది. కనకనే ఆ తరుణి అంగుళుల స్పర్శతోనే తన కంతటి మైకం కమ్ముకున్నది!

తా నొక్క దూకులో ఆ శయ్యాగృహంనుండి తప్పించుకుని బయట పడినపక్షంలో మరి తన్ను అడ్డుకోవడాని కెవరికి గుండె లున్నాయి? రాజకుమారి వెనువెంటనే చంపించి వెయ్యగలనని బెది రించిందిగాని, తనవంటి పవిత్ర శౌర్యమూర్తిమీది కెవ్వరయినా కత్తి ఎత్తగలరా?....ఒకవేళ అనంగలేఖ చంపించగలిగినా, అదే తన కన్నివిధాల అభిలషించదగిన వీరమరణమయి ఉండేది! తా నిప్పుడు జీవించేఉన్నాడు! కాని తనకన్న పూర్తిగా కుళ్ళిపోయిన శవమే నయం! వాస్తవానికి రాజకుమారి ఎడల తన కంతటి అభిలాషే కనక లేకపోతే, ఆమె తన్నంత తేలికగా లోబరుచుకోగలిగి ఉండేదా? పరి

స్థితుల ప్రాబల్యంపై నిందవేసి తప్పించుకోవాలని ప్రయత్నించి నందువల్ల కేవలం ఆత్మ వంచనతప్ప ఇంకేమి మిగులుతుంది?

ఆ విధమయిన ఆలోచనలతో తిరిగి దుర్లభవర్ధనుని కరుణ తలుచుకోగానే అతనికి తన జీవితంమీద ఒక్కసారుగా భరించ లేనంత ఏహ్యాభావం కలిగింది. తా నిక ఏ ముఖం పెట్టుకుని దుర్లభ వర్ధనుని సందర్శింపగలడు? కనక శీఘ్రమే బాకుతో పొడుచుకుని మరణించడమే మేలు! తన పంకిలజీవితాని కిక అదే సరిఅయిన ప్రాయశ్చిత్తము!

ఆ తీరులో నిశ్చయించినంతలోనే మెరుపులా అతని కింకొక ఆలోచన స్ఫురించింది. కేవలం వ్యర్థంగా ఆత్మహత్య చేసుకోవడం కన్న తన జీవితం ధారపోసి దుర్లభవర్ధనునికి తిరిగి ఏదోవిధంగా ప్రత్యుపకారంచేస్తూ మరణించి ఆ కృపామూర్తి ఋణం కొంత వరకయినా తీర్చుకోవడమే మేలని అనిపించింది. అందువల్ల తన మిత్రద్రోహ పాతిత్యాని కొకింతయినా నిష్కృతి లభించగలదన్న ఆలోచన కలిగింది.

ఆ క్షణంనించి ఖంఖమంత్రి మనస్సులో దుర్లభవర్ధనునికి తిరిగి చెయ్యబోయే ప్రత్యుపకారమన్న హోమజ్వాలలో తన జీవితం యావత్తు ఒక పూర్ణాహుతిగా సమర్పించివెయ్యాలన్న ధ్యాస ఒక్కటే ఆరని దివ్వెలా నిశ్చలంగా నిలిచి వెలిగింది.

అంతేకాదు. అప్పటినుండి అతడిక అనంగలేఖ మాటే తల పెట్టలేదు. ఆమె మనోజ్ఞమూర్తి ఎప్పుడయినా మనోవీథిలో సాక్షాత్క రించినా, పశ్చాత్తాపవహ్ని అతనిని కుతకుత ఉడికించివేసింది! దానితో రాకుమారిని గూర్చిన ఆలోచన పూర్తిగా మటుమాయమయింది!

ఆపైన దుర్లభవర్ధనునికి సంక్షిప్తమయిన ఒక లేఖ వ్రాసి దానిలో "కరుణానిధీ, వేయిజన్మలెత్తి నాచర్మంతో మీ పాదుకల జత రూపొందించినా మీ సౌహార్ద ఋణం నే నెన్నటికి తీర్చుకోజాలను! స్వామిద్రోహ కలుషితమయిన ఈ క్షుద్రజీవితం మీ చరణ పూజలో బలిగా సమర్పించినప్పుడే దీని కొకింత నిష్కృతి లభించగలదు!" అని మాత్రమే నివేదించుకున్నాడు.

ఆనాటినించి మంత్రి మరి దుర్లభవర్ధనునికి తిరిగి తన ముఖం చూపించలేదు. అలాగలాగ మరికొన్ని వారాలు గడిచిపోగానే బాలాదిత్య చక్రవర్తి పరమపదించారన్న వార్త శ్రీనగరంలో నలువైపుల కార్చిచ్చులా వ్యాపించింది. ఆ మరునాటినించి కాశ్మీర రాజధాని యావత్తు భీకర యుద్ధ కోలాహలంతో గజగజ వణికింది!

ఒకవైపున శాత్రవకేసరి పక్షం వహించిన సైన్యాలు, వేరొకవైపున దుర్లభవర్ధనునివైపు మొగ్గిన వాహినులు కాశ్మీర సింహాసనం స్వాధీనం చేసుకోవడంకోసం భీషణ సమరా లారంభించాయని ఖంఖ మంత్రి గ్రహించుకోవడాని కెంతోకాలం పట్టలేదు.

ఆ భయంకర సంగరంలో దుర్లభవర్ధనుని బలాలతో ఏకీభవించి ప్రాణాలర్పించడంకన్న తన జీవితాని కిక వేరొక లక్ష్యం లేదని ఖంఖామాత్యు డొక దృఢనిశ్చయానికి వచ్చివేశాడు. అదేవిధమయిన అచంచలదీక్షతో దుర్లభవర్ధనుని అంగీకారంతో అతని సేనల కగ్రభాగంలో నిలిచి ఒళ్ళెరగని వీరావేశంతో రణరంగంలో దూకి వీరవిహారం కొనసాగించాడు.

కాని క్రమక్రమంగా చక్రవర్తి జామాత వాహినులకే అడుగడుగునా ఘోరపరాజయం తటస్థించింది. అయినా ఖంఖు డెక్కడ, ఏమాత్రము సంచలించలేదు! ఆ యుద్ధాగ్నిజ్వాల అలాగలాగ అయిదారు దివసాల పర్యంతము చెలరేగింది. అయినా ఖంఖమంత్రి దృఢదీక్ష ఆవంతయినా సడలలేదు.

చిట్టచివరినాటి పోరాటంలో ఖంఖామాత్యుడే స్వయంగా సైన్యాధిపత్యం స్వీకరించి, నలువైపుల చెదిరిపోతున్న బలాల నన్నింటిని వెనక్కి మళ్ళించి శాత్రవ దుర్నిరీక్ష్యుడై ఎడతెగని పోరాటం కొనసాగించాడు. తన సేనలు పారిపోతున్నా, మరింత ధైర్యంతో

మున్ముందు కరికి వాని కన్నింటికి కొండంత ధైర్యం కలిగించాడు. క్రమక్రమంగా సాయంకాలానికి అతని వీరవిహారానికి ఎదురొడ్డి నిల బడలేక, శాత్రవకేసరి వాహిను లొక్కుమాదుగా వెన్నిచ్చి పలాయనం చిత్తగించాయి. ఆనా డెక్కడ విన్నా ఖంఖమంత్రి అత్యద్భుత పరాక్రమ గాథలే! అతని శౌర్య ప్రశంసలే! సూర్యాస్తమయ సమయానికి శాత్రవకేసరి మృతితో దుర్లభవర్ధనుని కఖండ విజయం లభించింది. కాని గాయాలతో నిండిన శరీరంనుండి నిరంతరంగా ప్రవహిస్తున్న రక్తధారలతో ఖంఖమంత్రి వివశుడై స్పృహతప్పి నేలమీది కొరిగి పోయాడు.

అతనికి తెలివి వచ్చేసరికి చుట్టు యుద్ధభూమి ఎక్కడ కానరాలేదు. తన భవనంలో పానుపుమీద శయనించినట్టు, నలుగురైదుగురు రాజవైద్యులు నిరంతర జాగరూకతతో చికిత్సచేస్తూ తనపై పే తిల కిస్తున్నట్టు గుర్తించుకున్నాడు. 'అయ్యో! నా కాయుద్ధంలో వీరమృతి లభించలేదు కాబోలు! నేనెంతటి పాపిని!' అని కొంచెం నెమ్మదిగా గొణుక్కుని ఉసూరుమని నిశ్వసించాడు.

మరికొంతసేపటి కతని సమక్షానికి దుర్లభవర్ధనుడే వచ్చి నిలిచి శరీర పరిస్థితి ఎలాగున్నదని చేతిసంజ్ఞలతో ప్రశ్నించాడు.

ఖంఖమంత్రి అతి కష్టంమీద తన చేతులు రెండు జోడించి, కృతజ్ఞతతో తొణికిసలాడుతున్న గద్గదస్వరంతో "సార్వభౌమా! మీ కీవిధంగా సేవచేసి ఒకింత కృతకృత్యుడనయినానని భావిస్తున్నాను. నే నిక జీవించగలనని తోచదు. తాము కాశ్మీరాధీశ్వరులయినందుకు నా కమందానందం కలిగింది. అయితే మీ పట్టాభిషేక మహోత్సవం కళ్లారా సందర్శించే భాగ్యానికి నోచుకోలేదు. మన్నించి సెలవిప్పించ వలసింది" అని తన తుదిపీడుకోలు విన్నవించాడు.

దుర్లభవర్ధను డతని నోదార్చి ఇనుమడిస్తున్న ప్రేముడితో ప్రసంగించాడు.

"రాజవైద్యులందరు మీ కిక ప్రాణాపాయం తప్పిపోయినదని గట్టిగా ధైర్యం చెబుతున్నారు. మీ కిక మృత్యుభీతి లేనేలేదు. పూర్తిగా ఆరోగ్యం కలిగిన పిమ్మట మీరే మీ స్వహస్తాలతో నా శిర స్సుపై సామ్రాజ్యపట్టాభిషేక మహోత్సవం జరిపించవలెనని నా కోరిక. అంతేకాదు. ఆటుపిమ్మట ప్రధానామాత్యులై మీరే నా సామ్రాజ్య సంరక్షణభారం వహించవలసిందని ప్రార్థన. అంత పర్యంతము మీరు పూర్తిగా కృతకృత్యులు కాజాలరు."

మరికొంతకాలానికి సంపూర్ణారోగ్యం కలిగిన పిమ్మట ఖంఖ మంత్రి సకుటుంబంగా వారణాసిలో నివసించవలెనని సంకల్పించు కున్నాడు. కాని దుర్లభవర్ధనునివంటి మహనీయవ్యక్తి కాదుకూడదని నిర్బంధించడంవల్ల, అతని సామ్రాజ్యానికి ప్రధానామాత్యపదవి స్వీకరించి స్వయంగా తానే పట్టాభిషేకం జరిపించాడు. అప్పటినుండి కృతజ్ఞతతో నిండిన అనంగలేఖ హృదయంలో ఆతని ఎడల మహ నీయమయిన గౌరవభావంమాత్రమే పెంపొందింది. ఇక ఖంఖమంత్రి పౌశీల్యం సంగతి వేరే వివరించనక్కరలేదు గదా!

---